# సుఖాంతం

## నిద్రమాత్ర పుచ్చుకుని గంటకిపైగా అయింది. ఇంతవరకు పని చేసినట్టు లేదు.

అక్కడికీ పన్నెండింటి దాకా ఇటూ అటూ దొర్లి ఇహ లాభంలేదని అప్పుడు పుచ్చుకున్నాను. రెండు మూడు గంటల సేపయినా నిద్రపట్టకపోతే తిన్నది అరగదు. అరక్కపోతే రేపు మళ్ళీ అదో బాధ. దానికి మందులు పుచ్చుకోవటం ఎలాగూ తప్పదు కదా అని నిద్రపట్టటానికి మాత్ర పుచ్చుకున్నాను.

ఇంట్లో ఎవ్వరూ లేరు కదా, ఒక్కర్తెనీ నిశ్శబ్దంగా పడుకోవచ్చుననుకున్నాను మధ్యాహ్నం. మాగన్నుగా కునుకుపట్టే వేళ 'పోస్టు' అనే పొలికేక గుండెల్ని అదరగొట్టి లేపింది. తీరా లేచి చూస్తే మహిళా మండలి చందా రసీదు. ఒళ్ళుమండి చెత్త కాగితాల బుట్టలో పడేసి మళ్ళీ వచ్చి మంచం మీద ఒత్తిగిలాను. గుండెదడ ఇంకా తగ్గలేదు. మంచినీళ్ళు తాగాలనిపించింది. ఓ గుక్కెడు మంచినీళ్ళు అందించే దిక్కులేదు కొంపలో. అలాగే బద్ధకంగా మంచం పట్టీ పట్టుకుని పడుకున్నాను. కాస్సేపటికి దడ తగ్గినట్లయింది. పక్కనే రేడియో బల్లమీద ఉన్న పేపరు తీసి చూడటం సాగించాను. అపోలో-11 సురక్షితంగా భూమ్మీదికి తిరిగి వచ్చిన తరవాత విశేషాలు కొంత మనఃస్థిమితాన్ని కలిగించాయి. ఈ చంద్రమండలయాత్ర ప్రారంభమయిన నాటి నుంచీ ఒకటే ఆదుర్దా - వాళ్ళు భూమి వాతావారణాన్ని దాటారా లేదా, చంద్రుని చుట్టూ ప్రదక్షిణ ప్రారంభించారా లేదా, 'ఎల్లెమ్'లో అన్ని భాగాలూ సరిగ్గా ఉన్నాయని నిర్ధారణ అయిందా లేదా - 'ఎల్లెమ్' చంద్రుని వైపు దిగటం మొదలయిందా లేదా - అంటూ అడుగడుక్కీ ఒకటే ఆరాటం. పొద్దున్న పేపరుకోసం, సాయంకాలం రేడియో వార్తల కోసం ఎదురుతెన్నులు. రాత్రంతా ఆలోచనలు. ఇక 20న కునుకు పడితే ఒట్టు. 'ఎల్లెమ్' చంద్రోపరితలం మీంచి విజయవంతంగా పైకి లేచిందా, కొలంబియాని కలుసుకుందా లేదా అని ఆదుర్దా. చివరికి ఉండబట్టలేక అర్ధరాత్రి వార్తాపత్రిక ఆఫీసుకి ఫోన్ చేశాను. 'కొలంబియాని ఇప్పుడే కలుసుకోబోతున్నది' అని చెప్పగానే ఒక్కక్షణం హాయిగా ఊపిరి పీల్చుకున్నాను.

మళ్ళీ ఆలోచనలు. తిరిగి భూమి వాతావరణంలో ప్రవేశించటానికి తగిన శక్తి ఉన్నదో లేదోనని మరో బాధ. నాకెందుకొచ్చిన ఆందోళన ఇదంతా - హాయిగా కళ్ళు మూసుకుని నిద్రపోక - అని ఎంత నచ్చజెప్పుకున్నా సరే ప్రపంచ సమస్యలన్నీ నా సమస్యలే అయినట్లు మధ్య నాకు నిద్రపట్టదు. అపోలో గొడవ అయిందనుకుంటే రాష్ట్రపతి సమస్య ఒకటి. రాత్రిళ్లు ఇక ఆలోచనలన్నీ ఇందిరా గాంధీ గురించీ, నిజలింగప్ప గురించీను.

పగలంతా అమ్మాయి దగ్గర నుంచి ఉత్తరం వస్తుందా, అబ్బాయి దగ్గర నుంచి ఉత్తరం వస్తుందా అని ఎదురు తెన్నులు చూడటంతోనే సరిపోతోంది. వంటింట్లో పనిచేస్తున్నా పడక్కుర్చీలో కూర్చుని పేపరు చదువుతున్నా ఆలోచనలన్నీ అమ్మాయి గురించీను. అబ్బాయి గురించీను. వాళ్ల సంసారాల గొడవలే వాళ్లకి గాని, అమ్మగురించీ నాన్నగురించీ ఆలోచించటానికి వాళ్ళకి వ్యవధి ఉన్నట్లు తోచదు. పోనీ, అబ్బాయి దగ్గరికి వెళ్లిఉందామా అంటే ఆయనకి నచ్చదు. వాళ్ల స్వాతంత్ర్యానికి మనం అడ్డురావటం దేనికి. వాళ్ల జీవితవిధానం వేరు, వాళ్ల ఆలోచనలు వేరు, మనకీ వాళ్లకీ పొత్తుకుదరదు, మనం ఇక్కడుంటేనే హాయిగా ఉంటుంది -అంటూ పెద్ద ఉపన్యాసం ఇస్తారు. ఆయనకేం, ఆయన రిటైరైపోయారు. ఇంటి వాటా మీద అద్దె వస్తోంది. అబ్బాయి మధ్య మధ్య ఏదో డబ్బు పంపిస్తూ ఉంటాడు. ఏదో తోచింది రాసుకుంటూ ఉంటారు - పత్రికల కనీ, సమావేశాలకనీ, పగలంతా ఎవరినో ఒకరిని కలుసుకోవటానికి వెళ్లటమో, ఇంట్లో కూర్చుని దీక్షగా రాసుకోవటమో చేస్తూ ఉంటారు. ఎటొచ్చీ యథావిధిగా వంట చెయ్యటానికి ఓపికలేక, ఊరికే కూర్చోనూ లేక అనేక రకాల ఆలోచనలతో నిద్రపట్టక సతమతమయేది నేనే.

నిద్రపట్టే రోజుల్లో ఇంటిల్లిపాదీ నన్ను తిన్నగా నిద్రపోనిచ్చారు కారు. ఏ ఒక్క రోజునా హాయిగా, మనస్సుకి తృప్తిగా నిద్రపోయింది లేదు. పసిపిల్లగా ఉన్నప్పటి సంగతి నాకు తెలియదుగాని, నాకు జ్ఞానం వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. ఒకటో క్లాసు చదువుతున్నప్పటి నుంచి 'బడికి పోవాలి, తొందరగా తెమలాలి, లేలే' అంటూ మంచి నిద్రలో లేపుతూండేది అమ్మ. అమ్మకి ఆచారం. వంటకి మడికట్టుకోవటం కోసం, ఈ లోపునే నాకు స్నానం చేయించి ముస్తాబుచేసి బడికి పంపించాలని తెల్లవారకుండానే లేపేసేది. ఎండాకాలం గాలి లేక రాత్రిళ్ళు త్వరగా నిద్ర పట్టక మర్నాడు పొద్దెక్కినా మెలుకువ వచ్చేది కాదు. కొంపలు మునిగిపోతున్నట్లు మొహం మీద నీళ్ళుజల్లి మరీ లేపేది. పోనీ ఆదివారం పూటయినా ఆలస్యంగా లేద్దామంటే తలంటు అంటూ ఒక తతంగం పెట్టేది. మార్నింగ్ స్కూల్స్ పెట్టారంటే నిద్రమత్తులోనే స్కూలుకి వెళ్ళినట్లుండేది. ఇహ పరీక్షల రోజుల్లో పుస్తకం ముట్టుకుంటేనే నిద్ర ముంచుకు వచ్చేది. చదువుకోకుండా ఎక్కడ పడుకుంటానోనని నాన్నగారు దగ్గర కూర్చోబెట్టుకుని చదివించేవారు. ఆవలింతలు ఒకదాని వెనుక మరొకటి

తరుముకొస్తుంటే గొంతులోనే మింగేసి ప్రాణాలు బిగపెట్టి చదవాల్సి వచ్చేది. మళ్ళీ తెల్లవారకుండా లేపేసే వారు చదువుకోమని. హాయిగా సెలవులివ్వగానే రాత్రనక పగలనక నిద్రపోవాలని నిశ్చయించుకుని ఎలాగో పరీక్షలు పూర్తి చేసేదాన్ని. అదేం పాపమో, శాపం పెట్టినట్లు సెలవుల్లో చస్తే నిద్ర వచ్చేది కాదు. పరీక్షల్లో పుస్తకాలు చదివితే నిద్ర కూరుకువచ్చేది. సెలవుల్లో పత్రికలూ నవలలూ చదువుతూంటే టైము తెలిసేది కాదు. 'పడుకోవే, అర్ధరాత్రిదాకా ఏమిటా చదువు' అని కేకలేసేది అమ్మ. కాలేజీలో ఆఖరి సంవత్సరం చదువుతున్నప్పుడు పరీక్షల్లో ఒట్టుపెట్టుకున్నాను - ఇహ జన్మలో పరీక్షలకి వెళ్ళకూడదు -హాయిగా రోజూ ఇష్టమొచ్చినంత సేపు నిద్రపోవాలని. ఇంట్లో అన్నయ్య, వదిన తొమ్మిదవకుండా తలుపులు వేసుకుని పడుకుంటే నాకు తెలియని ఆ హాయిని తలుచుకుని నా మనసు కుతకుతలాడేది. హాయిగా నేనూ పెళ్లి చేసుకుని నేనూ సుఖంగా రోజూ నిద్రపోవాలి అనీ, పరీక్షల్లేని నిద్రాభంగం లేని ఉల్లాస జీవితాన్ని గడపాలనీ నిశ్చయించుకున్నాను.

పెళ్లయితే అయిందిగాని నేననుకున్నట్లు మాత్రం సాగలేదు జీవితం. పొద్దున్నే తెల్లవారుతూనే లేవటం మాత్రం తప్పలేదు. అర్ధరాత్రి వరకూ ప్రణయలోకంలో విహరించి విహరించి అలిసి సొలిసి పడుకున్న దానికి పొద్దున్నే పాలవాడి కేక యముని రాక లాగే తోచేది నాకు. నిద్ర మత్తు వీడకుండానే లేవటం, కాలకృత్యాలు తీర్చుకోవటం, కాఫీ కార్యక్రమం, పనిమనిషి రాకపోకలు, వంటచేసి ఆయన్ని ఆఫీసుకి పంపటం, మెల్లిగా వంటింటి పనులు పూర్తిచేసుకుని పడక్కుర్చీలో వాలేసరికి పదకొండయేది. తాపీగా పొద్దుటి పేపరు చూసేసరికి కనురెప్పలు మూతలు పడేవి. ఇలా కునుకు పట్టేదో లేదో పోస్టువాడి కేకో, కూరల వాడి పిలుపో రెప్పలు విప్పేటట్లు చేసేది. లేకుంటే పక్కింటి పిల్లలు తమాషాకి కాలింగ్‌బెల్ నొక్కి పారిపోతూండేవారు. ఎవరో వచ్చారనుకుని తీరా తలుపు తీసి చూస్తే ఎవరూ ఉండరు. దూరం నుంచి పిల్లల నవ్వులు మాత్రం వినిపించేవి.

మళ్ళీ మధ్యాహ్నం ఆయన భోజనానికి రావటం, ఆయన్ని పంపించి ఏ పత్రికో నవలో తీసుకుని కాస్సేపు చదివేసరికి మళ్ళీ పోయిన ఆ కునుకు ఆశగా దగ్గర కొచ్చేది. అది కిట్టనట్లుగా ఈ లోపల పనిమనిషి వచ్చి 'అమ్మా' అంటూ దూడలా అరిచేది. ఆ తరవాత టిఫిన్ చెయ్యటం, సాయంకాలం వంట, మళ్ళీ యథాప్రకారం ప్రేమకలాపం, చాలీ చాలని నిద్ర.

మా ప్రేమ వేడి కాస్త చల్లారి గట్టిపడే వేళకి బాబిగాడు తగులుకున్నాడు. పగలంతా హాయిగా నిద్రపోయేవాడు. సాయంకాలం మమ్మల్ని ఆడించి మళ్ళీ రాత్రి పాలు తాగీ తాగడంతో నిద్రపోయేవాడు. తెల్లవారు ఝామునే కోడికన్నా ముందుగా లేచి 'ఊఁ ఆఁ' అంటూ చెప్పరాని సంతోషాన్ని వెలిబుచ్చేవాడు. వాడితో కలిసి వాడి సంతోషంలో పాలు

పంచుకోకపోతే కేర్‌మంటూ కొంప మునిగినట్లు ఏడ్చేవాడు. వాడికోసం నాలుగింటికే దీపం వేసి 'జేజ' 'జేజ' అంటూ వాణ్ణి ఆడించటం ఒక భాధ్యత అయిపోయింది. పొద్దున్నే వాడికి నీళ్లుపోసి పాలిచ్చి పొడరద్ది ఉయ్యాల్లో పడుకోబెడితే ఆదమరచి నిద్రపోయి పదిన్నరకి నా పని పూర్తయి కాస్త నడుం వాలుద్దామనుకున్న టైముకి లేచేవాడు. వాడితో ఆడుకోవాలనీ, వాడి ముద్దు మురిపాలు చూసి మురిసి పోవాలనే ఉండేది. నిద్రమాత్రం ముంచుకు వచ్చేది. వాణ్ణి పక్కలో వేసుకుని కక్కూర్తి పడి ఓ కునుకు తియ్యబోతే పమిట పట్టుకుని లాగటం, జుట్టు గుప్పెళ్లలో పట్టుకు లాగటం, పొట్టలో బుజ్జికాలు పెట్టి తన్నటం, నా నిద్ర పోగొట్టటానికి ఎన్ని చెయ్యాలో అన్నీ చేసేవాడు. పోనీ, వాడు ఎదిగాడు, నేను తనివితీరా నిద్రపోదామనుకుంటున్న రోజుల్లో వాడి చదువు ప్రారంభమయింది. వాణ్ణి పొద్దున్నే లేపి బడికి తయారుచేయటం కోసం నేనూ పొద్దున్నే లేవాల్సి వచ్చేది. ఇదికాక కడుపులో మరో పాపాయి కదలటం ప్రారంభించింది. ఇంట్లో క్రమక్రమంగా పెరుగుతున్న చాకిరీతో నిద్రకి మాత్రం వ్యవధి దొరికేది కాదు.

పిల్లలు పెద్దవాళ్లవుతున్న కొద్దీ వాళ్ల ప్రవర్తననీ వాళ్ల భవిష్యత్తునీ తీర్చేదిద్దే బాధ్యత చిన్నప్పటి నా పరీక్షలకన్న దుర్భరమయినదిగా తయారైంది. అనుక్షణం పిల్లల గురించి ఆలోచనే. వాళ్లు కాలేజి నుంచి కాస్త ఆలస్యంగా వస్తే కంగారు - కాస్త ఒంట్లో నలతగా ఉంటే భయం - అబ్బాయికి ఫస్టుక్లాసు వస్తుందో రాదోనని ఆందోళన- అమ్మాయికి మంచి సంబంధం దొరికేదాకా దిగులు - అబ్బాయికి మంచి ఉద్యోగం వచ్చేదాకా తపన - వాళ్ల పెళ్లి ఖర్చుల గురించి ఆందోళన - అమ్మాయి అత్తగారి తీరు గురించి దిగులు - కోడలు వచ్చాక అబ్బాయి నాతో ఇదివరకటిలా ఉండటం లేదు, నాకు దూరమైపోతున్నాడన్న దిగులు- అమ్మాయిని పుట్టింటికి పంపటంలేదన్న దిగులు -కోడలికింకా కానుపు రాలేదన్న దిగులు - నా ఒంట్లో బావుండనప్పుడు దగ్గరుండి చూసే దిక్కులేదన్న దిగులు - ఇన్ని దిగుళ్లతో నేనెక్కడ నిద్రపోగలను?

ఇప్పుడు పిల్లలు ఎవరి కాపరాలు వాళ్ళు చేసుకుంటున్నారు. వాళ్ళకి పిల్లలున్నా లేకపోయినా వాళ్ళ బాధేదో వాళ్ళు పడతారు. ఇహ మిగిలింది నేనూ ఆయనా - 'సమస్య లేమున్నాయి, వేళకి కాస్త వండుకొని తిని హాయిగా నిద్రపోరాదా, లేకపోతే కృష్ణారామా అనుకుంటూ కూర్చోరాదా' అంటారు. కృష్ణారామా అంటూ ఎంతసేపు కూర్చోనూ? పైకి అనుకుంటూ కూర్చుంటే విన్నవాళ్ళు పిచ్చిదాన్ని అనుకుంటారు. లోలోపల అనుకుంటే ఆ రాముడికీ కృష్ణుడికీ కూడా వినిపించదు. వినిపించని దానికి అనుకోవటం దేనికి? పైగా అందులో నాక్కావలసిన నిద్రపోయే మార్గం ఏమీ కనిపించలేదు. కృష్ణారామా అనుకుంటూంటే మిడిగుడ్లు పడిపోవటం తప్ప కళ్ళు మూతలు పడటం మాత్రం జరగలేదు.

పోనీ, కాలక్షేపానికి పేపరు చదువుకుంటూ కూర్చుని ఆ తరవాత ప్రశాంతంగా నిద్రపోదామా అంటే మనస్సు ఊరుకోదే. ఆ పేపరులో చదివినవాటి గురించి ఆలోచించటం సాగిస్తుంది. మళ్ళీ అపోలో - 11 గురించీ రాష్ట్రపతి గురించీ తెలంగాణా సమస్యల గురించీ ఆలోచనలు. నిద్రపట్టదు. పిల్లలు వాళ్ళ సంసారాలు వాళ్ళు చేసుకుంటున్నారు కదా అని నిశ్చింతగా ఊరుకుందామంటే కడుపు తీపి. వాళ్ళనే అనుక్షణం జ్ఞాపకం చేసుకుంటుంది మనస్సు. వాళ్ళ గురించే ఆలోచిస్తుంది. నిద్ర మాత్రం పట్టదు.

ఒక్కసారి హాయిగా తృప్తిగా నిద్రపోయిన రోజు నాకు గుర్తు లేదు. జీవితమంతా నిద్రకోసం మొహం వాచినట్లు అనిపిస్తోంది. ఒక్కసారి నిశ్చింతగా నిద్రపోయే వరం దేముడివ్వకూడదూ? 'నన్ను లేపకండి' అని బోర్డు తగిలించి నిద్రపోవాలని ప్రయత్నించినా ఫోను మోగటమో, పక్కింటి వాళ్ళబ్బాయి పేపరు కోసమో, కూరగాయలవాడో పేపర్లవాడో - రాత్రి పూటయితే పక్కింటి చంటివాడి ఏడుపో, కుక్కలో నక్కలో - ఏదో ఒక విధంగా నిద్రాభంగం కలక్క మానదు.

ఇక రెండు గంటలు గడిస్తే కోడికూస్తుంది. ఈ రెండు గంటలయినా ఓ కోడి కునుకు తియ్యకపోతే రేప్పొద్దున్నే లేచి ఇంటి పనులు చేసుకునే ఓపిక ఉండదు. ఒక్కపూట లేవకపోతే ఇల్లాంతా గల్లంతే. మరో నిద్రమాత్ర వేసుకుంటే మంచిది. ఈ పూట ఆలోచనలతో రెండు మాత్రలు వేసుకుంటే గాని కునుకుపట్టే యోగ్యత లేనట్టుంది.

లేచి వెళ్ళి ఓ గ్లాసుడు మంచినీళ్ళూ అలమారులో ఉన్న నిద్రమాత్రల సీసా తెచ్చుకున్నాను. ఒళ్ళు తిరిగినట్లయింది. నెమ్మదిగా కూర్చుని సీసామూత తీసి మెల్లిగా ఎడంచేతిలోకి ఓ మాత్రకోసం సీసా వంచాను. చెయ్యి తెగ వణికింది. సీసాలో మాత్రలన్నీ చేతిలో పడ్డాయి. నిద్రమాత్రలవన్నీ. వాటిలో నిద్ర ఉంది. ఆ నిద్ర నాకు కావాలి. ఒక్కసారి హాయిగా ఒళ్ళు మరిచి నిద్రపోవాలని ఉంది. వెధవ కోడికునుకులు నాకొద్దు. మనిషి నిద్రకావాలి. ఆ అనుభవాన్ని పుట్టినప్పటినుంచి నేనెరుగను. ఇవాళ అలాంటి అనుభవాన్ని పొందగలిగితే.

ఆ మాత్రం ఆలోచనకే నా హృదయం ఉప్పొంగిపోయింది. నిద్రకి మించిన సుఖం ప్రపంచంలో మరేదీ లేదు. ఇంతవరకు నాకు లభ్యంకాని సుఖం అదే. ఒక్కసారి తనివితీరా నిద్రపోవాలి.

ఎందుకన్నా మంచిదని మళ్ళీ లేచి బల్లమీద ఉన్న కాగితం అవీ తీసుకున్నాను. ఒళ్లో పుస్తకం ఒత్తు పెట్టుకుని పెన్సిలుతో నాలుగు ముక్కలు వొణుకుతున్న చేత్తో రాశాను.

'ఏమండీ, కంగారు పడకండి. నిద్రపోతున్నానంతే. ఆత్మహత్య చేసుకున్నానని అపార్థం చేసుకోకండి. కేవలం నిద్రకోసం నిద్రపోతున్నాను.'

*(జ్యోతి, దీపావళి ప్రత్యేక సంచిక '69)*